సాక్షి
నారాయణపేట
బుధవారం, 15, ఫిబ్రవరి, 2023



మల్లన్న సన్నిధికి..
శివమాలధారులు శ్రీశైలం మల్లన్న సన్నిధికి కాలినడకన పయనమవుతున్నారు.
వివరాలు 8లో ▸



సర్వాంగ సుందరంగా..
మహాశివరాత్రికి అలంపూర్ ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 36.4 /18.3
ఉదయం ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోత పెడుతుంది. రాత్రికి చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బేకరీల్లో ఆహార తనిఖీలు



మద్దూర్: మండల కేంద్రంలోని బేకరీలపై మంగళవారం జిల్లా ఆహార తనిఖీ అధికారి నీలిమ తనిఖీలు చేశారు. గోల్డెన్ బేకరీపై పలు ఫిర్యాదులు రావడంతో అందులోని వివిధ పదార్థాల శ్యాంపిళ్లు తీసుకున్నారు. నమూనాలకు సంబందించిన సమగ్ర రిపోర్టు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రతి విద్యార్థి విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి



నారాయణపేట టౌన్: పుల్వామా అమరవీరులకు నివాళి అర్పించడమే ఫిబ్రవరి–14 ప్రత్యేకత కావాలి.. అంతే కానీ వాలెంటైన్స్ డేగా అది మిగలకూడదని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్‌యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో బజరంగ్‌దళ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వాలెంటైన్స్ డే వ్యతిరేక దినంగా, అమరవీరుల దినోత్సవంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో పాడిపంటల్లో పెరిగిపోయిన కలుపు మొక్కలను ఏరివేసినట్లు విదేశీ విష సంస్కృతిని తీసివేయాలన్నారు. అందులో భాగంగా పెరిగిపోతున్న లవ్ జిహాద్ అనే విష కీటకాన్ని తరిమికొట్టాలన్నారు. మన సంస్కృతిని, మన కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలన్నారు. ప్రతి విద్యార్థిని, విద్యార్థులు తమ విద్యార్థి జీవతంలో విద్యకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జీవితంలో స్థిరపడిన తర్వాత ప్రేమ వివాహాల కోసం ఆలోచించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు వీరమరణం పొందిన అమరవీరులకు ఆత్మశాంతి కలుగాలని 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ భగవత్‌రెడ్డి, బజరంగ్‌దళ్ పట్టణ అధ్యక్షుడు వడ్ల శ్రవణ్‌కుమార్, నాకులు రితీష్, గోరక్షణ విభాగ్ ఇన్‌చార్జ్ రవికుమార్, రవికుమార్ వర్మ, తిలక్, ఆకాశ్, మనీ, అభి, వీరేష్, శౌర్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నోటీసులు



మరికల్/ధన్వాడ : పాఠశాలకు సక్రమంగా హాజరు కాని ఇద్ద రు ఉపాధ్యాయులకు డీఈఓ లియాకత్‌అలీ నోటీసులు జారీ చేశారు. మంగళవారం మరికల్, ధన్వా డ మండలాల్లోని పాఠశాలలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందిపల్లి పాంతతండా వద్ద 9:30 గంటలు అవుతున్నా పాఠశాల తాళం వేసి ఉండటం చూసి డీఈఓ విద్యార్థులతో ప్రార్థన చేయించారు. అనంతరం ఆలస్యంగా వచ్చిన టీచర్లపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. నిత్యం ఇలా వస్తున్న ఆంజనేయులు, నాగమణి అనే ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని వారిని కోరారు. లింగంపల్లి ఎల్లమ్మ జాతర సందర్భంగా మరికల్ మండలం ఇబ్రహీంపట్నం గ్రామంలో పాఠశాలకు సెలవు ప్రకటించడంతో ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారుల అనుమతి లేకుండా ఎలా సెల వు ఇస్తావని ఫోన్‌లో ప్రశ్నించారు. మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు.

రేపు జాబ్‌మేళా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విప్రో, టెక్ మహీంద్ర, ఐసీఐసీఐ బ్యాంక్ తదితర 10 కంపెనీల ఆధ్వర్యంలో జాబ్ మేళా ఉంటుందన్నారు. 2019 నుంచి 2022 వరకు డిగ్రీ పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు సర్టిఫికెట్లతో హాజరుకావాలని, పూర్తి సమాచారం కోసం సెల్ నంబర్లు 83094 04247, 63022 20289లను సంప్రదించాలని కోరారు.

పని చేసేవారికే ఉపాధి

ఉపాధి హామీ పథకంలో ఇనాక్టివ్ కూలీల గుర్తింపు



మద్దూరులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- జాబ్‌కార్డు ఉన్నా పనికి వెళ్లని కొందరు కూలీలు
- మరి కొందరికి రెండేసి కార్డులు
- జాబ్‌కార్డుకు ఆధార్ లింక్ 99శాతం పూర్తి



జిల్లాలో మొత్తం కూలీలు 2,28,274	యాక్టివ్‌గా ఉన్న కూలీలు 1,43,894
ఆధార్ లింక్ అయిన వారు 1,41,765	ఇనాక్టివ్ కూలీలు 84,380

మద్దూరు: పనిచేసే వారికే జాతీయ ఉపాధి హామీ పథకం వర్తింపజేయాలని, అక్రమాలను అరికట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే పథకం నిర్వహణలో అవకతవకలను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. ప్రతి కూలీ తన జాబ్‌కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయాలని నిర్ణయించింది. దీనివల్ల పనికి వెళ్లకుండానే కూలి డబ్బులు పొందుతున్న వారిని గుర్తించి, తొలగించేందుకు చర్యలు తీసుకుంటోంది. అలాగే గ్రామాల్లో జాబ్ కార్డులు ఉన్నా ఏడాదిలో ఒక్కరోజు కూడా పనికి వెళ్లని వారున్నారు. ఇలాంటి వారిని ఇనాక్టివ్‌గా గుర్తిస్తున్నారు. కొందరికి రెండేసి జాబ్‌కార్డులు ఉన్నాయి. మరికొందరికి పనులు చేయకపోయినా స్థానికంగా ఉండే ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో హాజరు వేయించుకుంటూ కూలీ డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

1,43 లక్షల మంది..

జిల్లాలో 1,43,894 మందిని మాత్రమే యాక్టివ్ కూలీలుగా గుర్తించారు. ప్రస్తుతం 1,41,765 కూలీలకు ఆధార్‌లింక్ పూర్తి చేశారు. జాబ్‌కార్డులు ఆధార్‌కార్డులో ఉన్న పొరపాట్లను సరిచేస్తే అర్హుల సంఖ్య మరింత పెరిగే అవకాశంఉంది.

ఇనాక్టివ్ కూలీలకు ఇబ్బంది

ఇనాక్టివ్ జాబితాలో ఉన్న 84,380 మంది కూలీలకు చెందిన జాబ్‌కార్డులు, ఆధార్ కార్డు వివరాలు సరిపోల్చడం లేదు. దీంతో ప్రస్తుతం వీరు ఉపాధి పొందే అవకాశం లేదు. వీరంతా 2008 నుంచి 2010 మధ్యకాలంలో జాబ్‌కార్డులు తీసుకున్నారు. ఆ తర్వాత వచ్చిన ఆధార్‌లో వివరాలు జాబ్‌కార్డులో ఉన్న వివరాలు తేడాగా ఉన్నాయి. వీటిని సరిచేసేందుకు కొంత సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

84వేల మందికి పైగా..

కూలీల హాజరు నమోదు కోసం ఇప్పటికే మొబైల్ మానిటరింగ్ సిస్టంను అమలు చేస్తున్నారు. డబ్బుల చెల్లింపుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్త విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. జిల్లాలో 2, 28,274 మంది కూలీలు ఉండగా అందులో 84,380 మంది కూలీలు ఇనాక్టివ్‌గా ఉన్నట్లు గుర్తించారు. వీరిలో జాబ్‌కార్డులు తీసుకున్న రోజు నుంచి ఇప్పటివరకూ ఒక్కరోజు కూడా పనిచేయని వారుండగా.. కొంతకాలంగా ఉపాధి కూలీకి వెళ్లని వారిని పరిగణలోకి తీసుకున్నారు. రెండు చోట్ల జాబ్‌కార్డులు ఉన్న వారి వివరాలను సైతం నమోదు చేసుకున్నారు. గత నెలలో ప్రారంభమైన ఆధార్ సీడింగ్ జిల్లాలో యాక్టివ్‌గా ఉన్న 1,43,894 మంది కూలీలకు గాను ఇప్పటివరకు 1,41,765 మందిని చేశారు. దాదాపు 98.52 శాతం ఆధార్ సీడింగ్ జరిగింది.

అధార్ లింక్ అయితేనే..

ఉపాధి హామీ కూలీలకు ప్రస్తుతం పోస్టల్, బ్యాంకుల ద్వారా డబ్బులు చెల్లిస్తున్నారు. గ్రామాల్లో పలుకుబడి ఉన్న కొందరు పనులకు వెళ్లకపోయినా హాజరు వేయించుకుని డబ్బులు పొందుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవలే పసిగట్టిన కేంద్రం చెల్లింపులలో పారదర్శకత తీసుకువచ్చేలా చర్యలు చేపట్టింది. కూలీల చెల్లింపుల్లో అక్రమాలను అడ్డుకునేందుకు ఆధార్ బేస్డ్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగానే జాబ్‌కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేస్తోంది. ఈ విధానం అమలుతో పనులుచేసిన వారికి మాత్రమే కూలీ డబ్బులు జమ కానున్నాయి.

అర్హులకు అవకాశం కల్పిస్తాం..



యాక్టివ్‌గా ఉన్న కూలీలను మొదటి ప్రాధాన్యతగా తీసుకొని ఆధార్ లింక్ చేస్తున్నాం. ఈ ప్రక్రియ జిల్లాలో దాదాపు పూర్తికావచ్చింది. ఇనాక్టివ్‌గా ఉన్న కూలీలకు ఆధార్, జాబ్‌కార్డుల ఉన్న వివరాల సరిపోలకపోవడంతో తిరస్కరణకు గురవుతున్నాయి. వీటి సవరణకు అవకాశం ఉంటుంది. అర్హులైన కూలీలు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఆధార్ లింక్ చేసిన వారికే ఖాతాలో కూలీ డబ్బులు జమ అవుతాయి.

– గోపాల్‌నాయక్, డీఆర్‌డీఓ

పనులు త్వరగా పూర్తి చేయండి



ముశ్రీఫాలో మన ఊరు.. మన బడి పనుల ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కోస్గి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు పాఠశాలల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు..మన బడి పథకంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని కోస్గి గాంధీస్మారక, సర్జఖాన్‌పేట, ముశ్రీఫా, నాచారం, గుండుమాల్, మీర్జాపూర్ గ్రామాల్లో పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముశ్రీఫాలో పనులు ఆలస్యం కావడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్..

మండల పరిధిలోని సర్జఖాన్‌పేట ప్రాథమిక పాఠశాల తనిఖీ సందర్భంగా కలెక్టర్ శ్రీహర్ష ఉపాధ్యాయుడిగా మారి ఆకట్టుకున్నారు. విద్యార్థులకు గణితంలో సామర్థ్యాలను పరిశీలించి పలు ప్రశ్నలు అడిగారు. స్వయంగా బోర్డుపై లెక్కలు చేసి ఆకట్టుకున్నారు.

షోకాజ్ నోటీసులు ఇవ్వండి..

సర్జఖాన్‌పేట పాఠశాలలో రికార్డులను పరిశీలించి తొలిమెట్టు కార్యక్రమంలో సక్రమంగా రికార్డులు నమోదు చేయకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించి పాఠశాలలోని నలుగురు ఉపాధ్యాయులతోపాటు క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అంతకుముందు చెన్నారం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి కూలీలతో మాట్లాడారు. చెన్నారం, కోస్గిలో కంటి వెలుగు శిబిరాలను పరిశీలించారు. రోజుకు చేయాల్సిన కంటి పరీక్షల కంటే తక్కువ సంఖ్యలో చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు.

భూసేకరణ సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట: జిల్లాలో భూసేకరణకు సంబంధించిన కోర్టు కేసులు, ఇతర సమస్యలు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్‌తో కలిసి జిల్లాలో భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులు, కోర్టు కేసులపై సమీక్షించారు. ఏ.జీ.పీతో తరచుగా మాట్లాడడం, అవార్డు విషయంలో ఫైనాన్స్‌లో పెండింగ్ ఏమైనా ఉంటే త్వరగా పరిష్కరించే విధంగా చూడాలన్నారు. జాతీయ రహదారి, ఇరిగేషన్‌కు భూసేకరణరకు సంబంధించి కోర్టులో పెండింగ్ ఉన్నందున త్వరగా భూసేకరణ చేయలేకపోతున్నామని తెలిపారు. కోర్టు కేసులు త్వరగా పరిష్కారం అయ్యేవిధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాని రిటైర్డ్ తహసిల్దార్ మల్లికార్జున్, ఆర్డీఓను కలెక్టర్ అదేశించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలి

నారాయణపేట: మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ జారీ అయిందని, ఈనెల 16న నోటిఫికేషన్ విడుదలవుతుందని.. ఎమ్మెల్సీ ఎన్నికలకు సైతం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తనా నియమావళి) అమల్లోకి వచ్చినందున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలని జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అన్ని రాజకీయ పార్టీలకు కలెక్టర్ శ్రీహర్ష విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అన్నిరాజకీయ పార్టీల ప్రతినిధులు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు మూడేళ్ల పాటు ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, వివిధ కళాశాలల్లో పనిచేస్తున్న బోధకులు మాత్రమే అర్హులన్నారు. అర్హులైన వారు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకున్నారని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఇంజనీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులు ఓటు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

జిల్లాలో 5 పోలింగ్ కేంద్రాలు..

జిల్లాలో 688 మంది ఉపాధ్యాయ ఓటర్లుగా నమోదు చేసుకున్నారని, వారికి 5 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 24న స్క్రూట్నీ, 27న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ అని తెలిపారు. వచ్చేనెల 13న ఎన్నికలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, మార్చి 16న ఓట్ల లెక్కింపు, 21న ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ముగుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి మతపరమైన ప్రార్థనా స్థలాల వద్ద నిషేధమన్నారు. ఎన్నికల ప్రచారానికి నిర్వహించే సభలకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రాంచందర్‌నాయక్, టీచర్స్ యూనియన్ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

24గంటల విద్యుత్ సరఫరా చేయాలి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

- కోతలకు నిరసనగా కాంగ్రెస్ నాయకుల ధర్నా
- రెండు గంటలపాటు రాస్తారోకో.. నిలిచిన వాహనాల రాకపోకలు

కోస్గి: దేశంలో ఎక్కడాలేని విధంగా వ్యవసాయానికి 24గంటల విద్యుత్ ఇస్తున్నామంటూ చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సమాచారం లేకుండా అప్రకటిత కరెంటు కోతలు విధిస్తుందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. రైతులకు కలుగుతున్న ఇబ్బందుల దృష్ట్యా విద్యుత్ కోతల విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. స్థానిక శివాజీ చౌరస్తాలో పాలమూర్–తాండూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రెండు గంటల పాటు బైఠాయించడంతో పెద్దఎత్తున వాహనాలు నిలిచి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. గొప్పలు చెప్పే ప్రభుత్వం రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని, 24 గంటల విద్యుత్ సరఫరా ఇచ్చే వరకు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం ర్యాలీగా స్థానిక సబ్‌స్టేషన్‌కు వెళ్లి ఏఈ పర్వతాలుకు వినతిపత్రం అందజేశారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, ఇద్రీస్, భానునాయక్, యూత్ అధ్యక్షుడు గిరిప్రసాద్‌రెడ్డి, టెంట్ నర్సింహ, నాయకులు సురేష్, శ్రీనివాస్, ఆసీఫ్, సలీం, వెంకట్రాములు, దేవేందర్, ప్రభోత్తం, పలుగ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరైన ఆర్థిక వ్యవహారాలతోనే రక్షణ



నారాయణపేట: సరైన ఆర్థిక వ్యవహారాలే మనం మోసపోకుండా కాపాడుతాయని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. మంగళవారం లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ వారోత్సవాల్లో భాగంగా నారాయణపేట మినీ స్టేడియం గ్రౌండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు జరిగిన అవగాహన ర్యాలీని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఈనెల 13 నుంచి 17 వరకు ఆర్థిక అక్షరాస్యత క్యాంపులు నిర్వహించి సైబర్ నేరాలు, యాప్‌ల ద్వారా రుణాల జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. డిజిటల్ లావాదేవీలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలు ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు, డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ఆర్డీఓ రాంచందర్‌నాయక్, ఎల్‌డీఎం విజయ్‌కుమార్, జెడ్పీ సీఈఓ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ సునీత, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

కందులు @ రూ.7,002

దేవరకద్ర/జడ్చర్ల: దేవరకద్ర మార్కెట్ యార్డు లో మంగళవారం జరిగిన ఈనామ్ టెండర్లలో కందుల ధర గరిష్ఠంగా రూ.7,002గా ఒకే ధర నమోదైంది. సీజన్ లేకపోవడంతో మార్కెట్‌లో లావాదేవీలు తక్కువగా కొనసాగాయి.

నేడు ఉల్లిపాయల వేలం..

దేవరకద్ర మార్కెట్ యార్డులో ప్రతి వారం జరిగే ఉల్లి పాయల బహిరంగ వేలం బుధవారం ఉదయం పది గంటలకు నిర్వహిస్తారు. వివిధ గ్రామాల నుంచి రైతులు తెచ్చే ఉల్లికి ఇక్కడి మార్కెట్‌లో బహిరంగ వేలం ద్వారా ధరలు నిర్ణయిస్తారు. స్థానిక వ్యాపారులతోపాటు బయట నుంచి వచ్చే వ్యాపారులు ఉల్లి వేలంలో పాల్గొంటారు.

వేరుశనగ క్వింటా రూ.8,400

బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేరుశనగకు గరిష్ఠంగా రూ.8,400, కనిష్ఠంగా రూ.4,269 ధరలు లభించాయి.

సర్కారు బడిలో అల్పాహారం..

నేటి నుంచి జిల్లాలో ప్రారంభం

- పదో తరగతి విద్యార్థులకు అందించేందుకు చర్యలు
- 34 రోజుల పాటు కొనసాగనున్న పథకం



నర్వ మండలం ఉందేకోడ్ పాఠశాలలో ప్రత్యేక స్టడీ అవర్స్‌లో పదోతరగతి విద్యార్థులు

జిల్లాలో ఉన్నత పాఠశాలలు 77	పదో తరగతి విద్యార్థులు 5,397
రూ.15తో పెంచిన మొత్తం అమౌంట్ రూ.80.955	34 రోజులకు విడుదలైన నిధులు రూ.27,52, 470

నర్వ: పదో తరగతిలో ఉత్తీర్ణత పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణతతో పాటు మంచి జీపీఏ సాధించేందుకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఉదయం, సాయంత్రం స్నాక్స్ అందక పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారు. ఆ ఇబ్బందులు తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే వారికి అల్పాహారం అందించనుంది. ఈ మేరకు భోజన ఏజెన్సీలకు అల్పాహారం ధరను పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కో విద్యార్థిపై రూ.15 చొప్పున ఖర్చు చేయనున్నారు.

ప్రత్యేక తరగతులు..

జిల్లాలోని 77 పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు జనవరి 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు సాయంత్రం 4:30 నుంచి 5:30 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. బడికి దూరమున్న వారు ఉదయం అల్పాహారం తినకుండానే వస్తున్నారు. వారు మధ్యాహ్నం భోజనం వరకు వేచి ఉంటున్నారు. మధ్యాహ్నం భోజనం చేశాక, రాత్రికి ఇంటికి చేరే వరకు ఆహారం తీసుకునే పరిస్థితి ఉండడం లేదు. దీంతో వారు నీరసించి, అలసటకు గురవుతున్నారు. ఫలితంగా చదువుపై దృష్టి సారించడం లేదు.

మధ్యాహ్న భోజన కార్మికులే..

ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 1 వరకు 34రోజుల పాటు విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ సంచాలకురాలు శ్రీదేవసేన శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. అల్పాహారంలో అటుకులు, బిస్కెట్లు, అరటిపండ్లు, పల్లీపట్టీలు అందించనున్నారు. దీనికి సంబంధించిన నిధులను ఎస్‌ఎంసీ ఖాతాల్లో జమ చేస్తారు. జిల్లాలో జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ ఇస్తున్నారు. డీఆర్డీఏ నుంచి ఒక్కో విద్యార్థికి రూ.10 విలువైన అల్పాహారాన్ని అందిస్తున్నారు. 20 రోజులుగా జిల్లాలో అమలు చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున ఇచ్చేందుకు నిర్ణయించింది. మధ్యాహ్న భోజనం వండే మహిళా కార్మికులే స్నాక్స్ అందించేలా చర్యలు తీసుకోవాలని డీఈఓలకు శ్రీదేవసేన ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం పాఠశాలల్లో ఐకేపీ, మహిళలు స్నాక్స్ అందిస్తున్నారు.

చదువుపై ఆసక్తి పెరుగుతుంది..



నేను నిత్యం లంకాల్ గ్రామం నుంచి నర్వ ఉన్నత పాఠశాలకు నడక దారిలో వస్తున్నాను. ఉదయం, సాయంత్రం పాఠశాలలో అల్పాహారం అందించడం వల్ల మాకు చదువుపై మరింత శ్రద్ధ కలుగుతుంది. ఆకలి వల్ల రోజూ ఇబ్బందిపడే విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుంది. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం.

– స్పందన, టెన్త్ క్లాస్, నర్వ

ఆరు కిలోమీటర్లు నడుస్తున్నాం..



నేను రోజూ కొత్తపల్లి గ్రామం నుంచి జెడ్పీహెచ్‌ఎస్ పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలకు రానుపోను ఆరు కిలోమీటర్లు నడుస్తాను. ప్రత్యేక తరగతులు ఉన్నందున ఉదయం ఇంటి నుంచి ఏమీ తినకుండానే బయల్దేరుతాము. ఉదయం, సాయంత్రం పాఠశాలలో అల్పాహారం అందిస్తే నాతోపాటు నాలాంటి వాళ్లకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

– మల్లమ్మ, టెన్త్ క్లాస్, పెద్దకడ్మూర్ గ్రామం

నేటి నుంచే అమలు



కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని 77 పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు స్నాక్స్ అందించాలని ఆదేశాలు జారీ చేశాం. హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ కమిటీలు, మధ్యాహ్న భోజన కార్మికులచే ఈ అల్పాహారం అందించే ఏర్పాట్లు చేపట్టాం. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అన్ని పాఠశాలల్లో చర్యలు తీసుకుంటున్నాం.

– లియాఖత్ అలీ, డీఈఓ

క్లుప్తంగా

కేఎస్పీ కుడికాల్వలో పడి మహిళ మృతి


అనిత(ఫైల్)

కోయిల్‌కొండ: మండలంలోని చందాపూర్ శివారులో ఉన్న కోయిల్‌సాగర్ కుడి కాల్వలో పడి మహిళ మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెంకట్రాములు, మణెమ్మ దంపతుల కూతురు అనిత(36)కు 15ఏళ్ల కిందట కొకుంట్లకు చెందిన కావాలి సత్యన్నతో వివాహం జరిగింది. కాగా, తండ్రి వెంకట్రాములు ఆరోగ్యం బాగ లేదని చూసివెళ్దామని అనిత చందాపూర్‌కు మూడు రోజుల కిందట వచ్చింది. సోమవారం సాయంత్రం బట్టలు ఉతికేందుకు గ్రామ శివారులో ఉన్న కోయిల్‌సాగర్ కుడి కాల్వ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతిచెందింది. రాత్రి అయినప్పటికీ అనిత ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గ్రామస్తుల సహకారంతో కాల్వలో వెతకగా మృతదేహం లభించింది. మృతురాలికి భర్త సత్యన్న, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

భువనగిరి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్‌కు చెందిన నడిపే వెంకటస్వామి(55) కుటుంబ సభ్యులతో కలిసి భువనగిరి మండలంలోని తుక్కాపురం గ్రామపరిధిలో గల మామిడి తోటలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం మంగళవారం గ్రామం నుంచి భువనగిరికి బైకుపై వస్తున్నాడు. పట్టణంలోని ఎంఎస్ వైన్స్ సమీపంలోకి రాగానే నల్లగొండ నుంచి భువనగిరి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు వెనక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

జడ్చర్ల: ఎత్తయిన భవనానికి రంగులు వేస్తున్న యువకుడు ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గోపాల్(23) సాయినగర్ కాలనీలో రెండతుస్తుల భవనానికి రంగులు వేస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదశాత్తు జారి నేలపై పడడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే 108 అంబులెన్స్‌లో వైద్య చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాయపల్లికి చెందిన యువకుడు..


శివకుమార్ (ఫైల్)

రాజాపూర్: దాడి ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నెల 11వ తేదీ రాత్రి రాయపల్లికి చెందిన శివకుమార్(28)పై అదే గ్రామానికి చెందిన లక్ష్మయ్య, అతని కుమారుడు దాడి చేశారు. ఈ ఘటనలో శివకుమార్ తలపై కట్టెతో బలంగా బాదడంతో ఆయన తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే శివను హైదరాబాద్‌లోకి గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు రాజాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మృతుడి అన్న పాశం నర్సింలు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు జరుపుతున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య శ్రావణితో పాటు మూడేళ్ల కుమారుడు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

నవాబుపేట: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కామారంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కామారానికి చెందిన అమ్మపూరం రాఘవేందర్(19) ఒంటరిగా ఉండటం అలవాటు కావడంతో రాత్రి సమయంలో పిచ్చిపిచ్చి కళలు పడుతున్నాయని, తాను చనిపోతానని తల్లిదండ్రులతో చెబుతుండేవాడు. సోమవారం ఇంట్లో నుండి వెళ్లిపోయి పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉండగా, పక్క పొలం వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే 108 వాహనంలో చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. మృతుడి తండ్రి సత్యయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సోమశిల గ్రామ సమీపంలోని కృష్ణానది బ్యాక్ వాటర్‌లో గుర్తు తెలియని మృతదేహం నదిలో కొట్టుకొని వచ్చి వీఐపీ ఘాట్ దగ్గర పడి ఉన్నదని ఎస్‌ఐ బాలవెంకటరమణ తెలిపారు. ఈ మగ శవం కుళ్లిపోయి ఉందని.. వివరాలకు 87126 57719ను సంప్రదించాలని సూచించారు.

వడివడిగా మల్లన్న సన్నిధికి..

- రాత్రి చలి, పగలు ఎండలోనూ శివస్వాముల పాదయాత్ర
- నల్లమలలో ప్రతిధ్వనిస్తున్న శివనామ స్మరణ
- భక్తుల సేవలో దాతలు.. ప్రత్యేక ఏర్పాట్లు

అచ్చంపేట: హరహర మహాదేవ.. శంభోశంకర. ఓం నమః శివాయ.. అంటూ శివమాలధారులు కాలినడకన శ్రీశైలం మల్లన్న సన్నిధికి పయనమయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు దట్టమైన నల్లమల అటవీ ప్రాంతం గుండా వందల కిలోమీటర్లు నడిచి వెళ్తున్నారు. ఈ క్రమంలో కాళ్ల నొప్పులు, పాదాలు పగలడం, బొబ్బలెక్కడం వంటి సమస్యలు వారిని ఇబ్బందిపెడుతున్నాయి. అయినా శివనామ స్మరణతో పాదయాత్రగా ముందుకు సాగుతున్నారు. రాత్రివేళ మూడు, నాలుగు గంటలు మాత్రమే నిద్రపోతున్నారు. రాత్రి 3గంటల తర్వాత తిరిగి నడక ప్రారంభిస్తున్నారు.


పాదయాత్ర చేస్తున్న భక్తులు


ఉమామహేశ్వర క్షేత్రంలో అన్నదానం


శివసన్నిధి సేవాసమితి ఆధ్వర్యంలో వటువర్లపల్లి వద్ద పండ్ల పంపిణీ

భక్తుల ఆకలి తీరుస్తున్న దాతలు..

కాలినడకన శ్రీశైల క్షేత్రం వెళ్లే శివభక్తులకు ఇక్కడి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఆహారం అందిస్తున్నాయి. సేద తీరేందుకు సౌకర్యాలు కల్పించి తమ భక్తిని చాటుకుంటున్నారు. మన్ననూర్, పర్హాబాద్, వటువర్లపల్లి, రాసమల్లబావి వద్ద 14–16ఏళ్లగా దాతలు ముందుకు వస్తున్నారు. శివస్వాముల ఆకలి తీర్చేందుకు అన్నదాన కేంద్రాలు 20కిపైగా ఏర్పాటు చేశారు. అల్పాహారం, తాగు నీటిని అందిస్తున్నారు.

నిత్యాన్నదాన సత్రాలు..

శ్రీశైలంలో 50కి పైగా నిత్య అన్నదాన సత్రాలు ఉన్నాయి. అన్నదాన సత్రాలలో అన్నపూర్ణాదేవికి అర్చనలు చేస్తున్నారు. వాసవీ సత్రం, కొండవీటి రెడ్ల సత్రం, మున్నూరుకాపు సత్రం, వెలమ సత్రం, విశ్వబ్రాహ్మణ సత్రం, అన్నదాన సత్రం, కమ్మసత్రం, కాకతీయ సత్రం, కంబం సత్రం, యాదవ సత్రం, శ్రీకృష్ణదేవరాయ సత్రం, ఆరెకటిక, మేరు సంఘం, వెలుమ, వందేళ్ల నాటి కరివెన సత్రాలతో పాటు మరిన్ని సత్రాలు నిరాఘాటంగా నిత్య అన్నదానాలు చేయడంలో వెనకాడటం లేదు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అటకేశ్వర సమీపంలోని నాలుగు ఆశ్రమాలు వేలాది మంది భక్తులకు అన్నదానం చేస్తున్నాయి. శ్రీశైలంలో ఒక్కరికి అన్నదానం చేస్తే కాశీలో లక్ష మందికి అన్నదానం చేసిన పుణ్యం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయనే నేపథ్యంలో.. అన్నవితరణకు వేలాది మంది విశేషంగా విరాళాలు సమర్పిస్తున్నారు. శ్రీశైలంలో అన్నదాన ప్రభంజనంతో హర్షితరేఖలు వ్యక్తం చేస్తూ 'అన్నదాతా సుఖీభవ' అంటూ దీవిస్తున్నారు.

వైద్యం, మందులు ఇస్తున్నాం..



వటువర్లపల్లి అటవీ సమీపంలో శివభక్తులకు 12ఏళ్లుగా పండ్లు అందిస్తున్నాం. విశ్రాంతికి విడిది, ప్రథమ చికిత్స మందులు అందజేస్తున్నాం. వందల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే భక్తులకు విడిది కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతోంది. మహేందర్‌రెడ్డి, రవిందర్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు, వినోద్, ప్రభాకర్‌రావు మిత్రులతో కలిసి మార్గమధ్యలో నీళ్లు, పండ్లు అందజేస్తున్నాం. – కపిలవాయి సురేష్, శివసన్నిధి సేవా సంఘం, అచ్చంపేట

ఏళ్లుగా అన్నదానం చేస్తున్నాం..



ఉమామహేశ్వరం క్షేత్రంలో శివరాత్రి సందర్భంగా శివస్వాములకు 20ఏళ్లుగా అన్నదానం చేస్తున్నాం. వీఎస్‌సీ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో తూడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో ఏటా నాలుగు రోజుల పాటు, రోజుకు 3వేల మందికి అన్నదానం చేస్తాం. – మన్సూర్ శిష్య బృందం, వనపర్తి

శివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు మన రాష్ట్రం నుంచే గాక ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి పాదయాత్ర ద్వారా వచ్చే శివస్వాములు, భక్తులకు అటవీ, పోలీస్ శాఖలు ప్రత్యేక సూచనలు, షరతులు పెట్టింది. నల్లమలలో అగ్ని ప్రమాదాల నివారణకు తెలంగాణ అటవీశాఖ ప్రత్యేక ఆంక్షలు తీసుకొచ్చింది. అదేవిధంగా అటవీ ప్రాంతాల్లో ప్రవేశంపై ఆంక్షలు విధించారు. అమ్రాబాద్ అభయారణ్యం రక్షిత ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారులు ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

అటవీశాఖ సూచనలు..

- కాలినడకన వెళ్లే స్వాములు, భక్తులు నిర్దేశించిన ప్రాంతాలు, రోడ్డువెంటనే ప్రయాణించాలి. అడవిలోని ఇతర మార్గాల్లో ప్రయాణం నిషేధించారు.
- భక్తులు రోడ్డకు ఎడమ వైపున నడవాలి.
- రోడ్డుపై విశ్రాంతి తీసుకోకూడదు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విరామ ప్రాంతాల్లో సేద తీరాలి.
- అటవీ ప్రాంతంలో వంటలు వండటం, నిప్పు రాజేయడం చేయవద్దు. నిబంధనలు ఉల్లంఘిస్తే అటవీశాఖ కఠిన చర్యలు తీసుకుంటుంది.
- ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు అడవిలో వేయవద్దు.
- మన్ననూర్, వటువర్లపల్లి వద్ద శివభక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు ఉంటుంది.
- రాత్రిపూట పాదయాత్ర చేసే శివస్వాములు టార్చిలైట్ లేదా ముందు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి రహదారి సూచనగా తెల్లగుడ్డ కట్టాలి.
- కోతులకు తినే పదార్థాలు వేయరాదు.
- **దారిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా అమ్రాబాద్ సీఐ (సెల్: 8712657739), ఈగలపెంట ఎస్‌ఐ (సెల్: 8712657741)లను సంప్రదించాలి.**

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు

- తెలుగుభాష సంరక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి


తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

వనపర్తిటౌన్: తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని వెలుగెత్తి చాటాల్సిన అవసరం ఉందని తెలుగుభాష సంరక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి అన్నారు. మాతృ, పితృ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. 120 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేసి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణరెడ్డి మాట్లాడుతూ.. తల్లిని మించిన దైవం, తండ్రిని మించిన ధర్మం లేదన్నారు. తండ్రి రుణం తీర్చుకునేందుకు శాస్త్రంలో యాగాలున్నా.. తల్లి రుణం తీర్చుకునేందుకు ఎలాంటి యాగాలు లేవని, మాతృసేవకు వెలకట్టలేమని వివరించారు. అవసన దశలో తల్లిదండ్రులకు అండగా ఉండటం మాని, అన్నదమ్ములు వంతులేసుకొని ఆశ్రమాలకు పంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ చెట్టు నాటితే ఆ ఫలం వచ్చినట్లుగా మనం ఎలా వ్యవహరిస్తే వృద్ధాప్యంలో అదే స్థితి వస్తుందని వివరించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఆస్తిపాస్తులు కోరుకోరని.. పట్టెడన్నం, గంపెడు ప్రేమే కోరుకుంటారని చెప్పారు. కూలీ పనిచేసే వ్యక్తి రోజులో ఒక్కసారైనా నెత్తిన ఉన్న తట్టను కాసేపు దించుతాడని.. కడుపులో బిడ్డ పడ్డప్పటి నుంచి రోజురోజుకు బరువు పెరుగుతున్నా తన ప్రాణాలను లెక్కచేయక ఊపిరి పోసిన తల్లికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు బద్రీనాథ్, జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ, హెచ్‌ఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన ఆటో


ఆటోను బయటకు తీస్తున్న గ్రామస్తులు


చెరువు వద్ద గుమిగూడిన జనం

- 20 మంది విద్యార్థులకు తప్పిన ప్రమాదం

తెలకపల్లి: పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకొని వెళ్తున్న ఓ ఆటో అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. అయితే ఎవరికీ గాయాలు కాకపోవడంతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలోని గడ్డంపల్లిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. గడ్డంపల్లికి చెందిన మల్లేశ్ తన ఆటోలో మంగళవారం ఉదయం 8.30 గంటల సమయంలో గడ్డంపల్లి నుంచి మంతటి పాఠశాలకు, జిల్లాకేంద్రమైన నాగర్‌కర్నూల్‌లోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే 20 మందికి పైగా విద్యార్థులను ఎక్కించుకొని బయలుదేరాడు. అయితే గ్రామ శివారులో ఉన్న చెరువుకట్టపై వెళ్తుండగా ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు భరత్, సాయి, నరేశ్, అంకిత, శిరీష, శ్రావణి, నందినిలకు స్వల్ప గాయాలు కాగా.. నదియ అనే విద్యార్థినికి ఎక్కువ గాయాలు, మరో మహిళ గాయపడింది. వెంటనే డ్రైవర్‌తోపాటు మరికొందరు గ్రామస్తులు విద్యార్థులను బయటికి తీయడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. సామర్థ్యానికి మించి ఆటోలో ప్రయాణించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, ఇకపై పొరపాట్లు పునరావృతం కావొద్దని ఎంపీపీ మధు, సర్పంచ్ లక్ష్మయ్య ఆటో డ్రైవర్‌ను హెచ్చరించారు.

హోరాహోరీగా బల ప్రదర్శన

అయిజ: పట్టణంలోని తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రకాల అంతర్రాష్ట్ర బల ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేశారు. సోమవారం అర్ధరాత్రి వరకు అంతర్రాష్ట్ర స్థాయి ఒంటెద్దు(రెండు బండ్ల గిరక) బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. అదేవిధంగా మంగళవారం అంతర్రాష్ట్ర పొట్టేళ్ల బల ప్రదర్శన పోటీలు రసవత్తరంగా జరిగాయి.

- అంతర్రాష్ట్ర స్థాయి ఒంటెద్దు బల ప్రదర్శనకు వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 26 ఎద్దులు పాల్గొన్నాయి. కర్నూలుకు చెందిన రామాంజనేయులు ఎద్దు ప్రథమ స్థానంలో నిలిచి మొదటి బహుమతి రూ.20 వేలు కైవసం చేసుకుంది. అదేవిధంగా కడప జిల్లాకు చెందిన నరసింహారెడ్డి ఎద్దు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.15 వేలు దక్కించుకుంది. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజకి చెందిన ఏసోబు ఎద్దు తృతీయ స్థానంలో నిలిచి రూ. 10 వేలు కైవసం చేసుకుంది.
- అంతర్రాష్ట్ర పోటేళ్ల బల ప్రదర్శనకు వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 15 పోటేళ్లు పాల్గొన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఆలీ పోటేళ్లు ప్రథమ బహుమతి రూ. 20 వేలు గెలుచుకుంది. అదేవిధంగా కర్నూలు జిల్లాకు చెందిన పరుశురాముడు పోటేళ్లు ద్వితీయ బహుమతి రూ.15వేలు, జోగుళాంబ గద్వాల జిల్లా కొంకలకు చెందిన పోటేళ్లు తృతీయ బహుమతి రూ.10 వేలు, కర్నూలు జిల్లా బీ తాండ్రపాడుకు చెందిన హనుమాన్ పోటేళ్లు నాల్గో బహుమతి రూ. 5 వేలు గెలుచుకున్నాయి.


తలపడుతున్న పొటేళ్లు

మహిళ బలవన్మరణం

కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాలతండాకు చెందిన ఓ మహిళ సోమవారం ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. తండాకు చెందిన సంధ్య(28) అనే మహిళ సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందింది. కాగా సంధ్య భర్త ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే సంధ్య మృతదేహాన్ని మంగళవారం వరకు స్వగ్రామానికి తీసుకురాలేదు. రెండు రోజులుగా కర్నూలు ఆస్పత్రిలోనే ఉండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఎస్‌ఐ వెంకటేష్ స్పందిస్తూ తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

అత్యాచార ఘటనలో నిందితుడి రిమాండ్

బాలానగర్: వివాహితపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలోని మేడిగడ్డ తండాకు చెందిన ఓ వివాహితపై ఫిబ్రవరి 6న, అంతకుముందు మరోమారు అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు పాత్లావత్ శంకర్(24)ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వివాహితను వేధించిన కేసులో..

నవాబుపేట: మండలానికి చెందిన ఒక వివాహితను ప్రేమిస్తున్నాని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. కొందుర్గు మండలం ఆగిర్యాల్‌కు చెందిన గూడెపు శ్రీనివాసులు నవాబుపేట మండలానికి చెందిన వివాహితను ప్రేమ పేరుతో వేధిస్తూ తనను పెళ్లి చేసుకోవాలని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఎంత చెప్పినా తీరు మార్చుకోకపోవడంతో బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.



భూ వ్యవహారమే హత్యాయత్నానికి కారణం

- బాయమ్మతోట డబుల్ హత్యాయత్నం కేసులో నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కె.నరసింహ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కె.నరసింహ, ఇన్‌సెట్‌లో నిందితులు


ఉపయోగించిన కత్తులు

మహబూబ్‌నగర్ క్రైం: భూ వ్యవహారంలో అడ్డువస్తున్నారని పథకం ప్రకారం రెక్కీ నిర్వహించి ఈ నెల 7న రాత్రి జిల్లాకేంద్రంలోని బాయమ్మతోట సమీపంలో ఆరుగురు వ్యక్తులు కలిసి తండ్రి, కొడుకుపై కత్తులతో దాడి చేసినట్లు ఎస్పీ నరసింహ వివరించారు. మంగళవారం రాత్రి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన కరీంకు అల్లీపూర్ శివారులో 196 ఎకరాల భూమి ఉంది. కరీం మృతిచెందిన తర్వాత ఆయన కుమారులు ఎండీ రషీద్, ఎండీ హకీంకు చెందకుండా వేరే వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి వెంచర్లుగా మార్చి ప్లాట్లు విక్రయించారు. 2019లో కరీం వారసులు (మనుమళ్లు) అలీం, వాహెబ్‌తో నిందితులైన షేక్ హసీమ్, అబ్దుల్ అహ్మద్, ఇజాజ్ అహ్మద్‌తో పాటు మరో 13 మంది కలిసి నిందితులకు 60 శాతం, వారసులకు 40 శాతం చెందేలా జీపీఏ చేయించుకున్నారు. ఈ క్రమంలో నిందితులు అలీంకు తెలియకుండా అతడి సంతకాలు ఫోర్జరీ చేసి 8 ప్లాట్లను విక్రయించి డబ్బులు తీసుకున్నారు. దీనిపై అలీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2022లో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత అలీం తనకు బావ వరస అయిన శ్రీనివాసకాలనీకి చెందిన ఎండీ హబీబ్ ఉర్ రహమాన్‌కు జరిగిన విషయం చెప్పి నిందితులకు తెలియకుండా ఎండీ హబీబ్ ఉర్ రహమాన్‌కు జీపీఏ చేశారు. దీంతో ఎండీ హబీబ్ ఉర్ రహమాన్ 2022లో భూమి దగ్గరకు వెళ్లి అక్కడ ఒక గది నిర్మించుకొని, ఆ తర్వాత షేక్ హసీమ్, అబ్దుల్ అహ్మద్, ఇజాజ్ అహ్మద్‌ను సదరు భూమి దగ్గరకు రావొద్దని బెదిరించారు. మరోసారి స్నేహితుడు సైతాన్ ఫారూక్‌ను షేక్ హసీమ్ ఇంటికి తీసుకెళ్లి భూమి దగ్గరకు వస్తే చంపుతానని బెదిరించారు. దీంతో ఎండీ హబీబ్ ఉర్ రహమాన్‌ను ఇలాగే వదిలేస్తే తమకు ప్రాణహాని ఉందని భావించిన నిందితులు ఎలాగైన రహమాన్‌ను చంపాలని నిర్ణయించారు. ఇందుకు మహ్మద్ అబ్దుల్ నవాజ్, మహ్మద్ రహమాత్ సహకారం కోరి ఒక్కొక్కరికి 200 గజాల ప్లాట్ ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే మహ్మద్ గౌస్‌పాషా అలియాస్ గోరెబ అనే రౌడీషీటర్‌ను కలుపుకొని హత్యకు సహకరిస్తే ఎకరం భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఆరుగురు కలిసి రెక్కీ నిర్వహించి ఓసారి అబ్దుల్ ఖాదర్ దర్గా సమీపంలో, మరోసారి మెట్టుగడ్డ సమీపంలో చంపాలని ప్రయత్నించి విఫలమయ్యారు. హబీబ్ ఉర్ రహమాన్‌కు మధుమేహం ఉండటంతో రోజు ఎర్రసత్యం చౌరస్తాలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ఇన్సులిన్ తీసుకోవడానికి వస్తాడని గుర్తించి.. పథకం ప్రకారం ఈ నెల 7న రాత్రి రహమాన్, కుమారుడు అబ్దుల్ రహమాన్‌తో కలిసి ఆస్పత్రి నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుంటే నిందితులు రెండు ద్విచక్ర వాహనాలపై వెంబడించి బాయమ్మతోట అంజలి మెస్ సమీపంలో ఇద్దరిపై కత్తులతో దాడిచేసి పరారయ్యారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల పరిశీలన, దాడి చేస్తున్న క్రమంలో తీసిన వీడియోల ఆధారంగా దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఎస్పీ వివరించారు. ఇందులో ఏ–1 షేక్ హసీం, ఏ–2 ఎండీ అహ్మద్, ఏ–3 మహ్మద్ అబ్దుల్ నవాజ్, ఏ–4 ఎండీ రహమాత్, ఏ–5 మహ్మద్ గౌస్‌పాషా అలియాస్ గోరెబను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, ఏ–6 ఎండీ ఇజాజ్ అహ్మద్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులు వినియోగించిన రెండు స్కూటీలు, ఒక ద్విచక్ర వాహనం, కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఆరుగురిపై గతంలో కేసులు ఉన్నాయని.. అందరిపై పీడీ యాక్ట్ నమోదు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీ మహేష్, టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

- హౌస్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యక్తిగత, వ్యవసాయ భూములపై అతి తక్కువ వడ్డీతో ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. ✆ 9988199941.
- వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్‌ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా ఋణానికి వర్తిస్తాయి. సంప్ర: 94630 26237

WANTED

- మహబూబ్ నగర్ బ్రాంచ్‌లో పనిచేయుటకు 39 (స్త్రీ/పు) కావలెను. జీ : 14వేలు +DA 6వేలు + ఫ్రీ రూం, భోజనం, నో ఫీజు. సంప్ర : 80742 77136
- Work from Home (Work in Mobile) m2m company online marketing Earn More Income, no qualification, male or female (Part time or full time) Ph: 7416404028.
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు, కావలెను, ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18 k ఏజెంట్స్ కమీషన్ 9k ఫోన్: 7569965551, 9848571888.
- వెంటనే కావలెను : పంచలింగాల, తాండ్రపాడు సమీపంలో గల అల్యాటిస్ మరియు హైపో ఫ్యాక్టరీలలో పనిచేయుటకు సెక్యూరిటీ, ఫైర్ గార్డ్స్, ల్యాబ్ బాయ్స్ కావలెను. 8 గంటలు డ్యూటీ, జీతం : 9 వేలు ఆపైన, (4వీక్లీ ఆఫ్‌లు). సంప్ర : 94942 22218, 83419 57788.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50 మాత్రమే
5% GST అదనం

వివరాలకు :

మహబూబ్‌నగర్	9010234478
	9010522215
	9705135557
	9010869797
జడ్చర్ల	9010076222
నాగర్‌కర్నూల్	9010006785
వనపర్తి	9010068317
గద్వాల	9553955603
నారాయణపేట	9010962007

గమనిక

[illegible] – సాక్షి మేనేజ్‌మెంట్

క్లుప్తంగా...

'ఈనాడు' వ్యాజ్యాలు కొట్టివేత

- ప్రభుత్వ జీవోల అమలు నిలుపుదలకు ఏపీ హైకోర్టు నిరాకరణ
- ఏబీసీని నిరోధించాలన్న అభ్యర్థన కూడా తిరస్కృతి



సాక్షి, అమరావతి: విస్తృత సర్క్యులేషన్ కలిగిన ఏదైనా ఓ దినపత్రికను కొనుగోలు చేసేందుకు సచివాలయాలు, వలంటీర్లకు నెలకు రూ.200 ఆర్థిక సాయాన్ని అందచేస్తూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోల అమలును నిలిపివేయాలన్న 'ఈనాడు'అభ్యర్థనను ఆ రాష్ట్ర హైకోర్టు తోసిపుచ్చింది. వలంటీర్లు, సచివాలయాల ద్వారా జరిగే 'సాక్షి'దినపత్రిక కొనుగోళ్లను పరిగణనలోకి తీసుకోకుండా ఆడిట్ బ్యూరో సర్క్యులేషన్ (ఏబీసీ)ను ఆదేశించాలన్న అభ్యర్థనను సైతం తోసిపుచ్చింది. ఈ మేరకు ఈనాడు దాఖలు చేసిన రెండు అనుబంధ వ్యాజ్యాలను కొట్టివేసింది. నిర్దిష్టంగా ఫలానా పత్రికను మాత్రమే కొనుగోలు చేయాలంటూ వలంటీర్లు, సచివాలయాలను ప్రభుత్వం ఆదేశిస్తున్నట్లుగా ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదని ధర్మాసనం గుర్తు చేసింది. రూ.200 ఆర్థిక సాయాన్ని వలంటీర్లు, సచివాలయాలు 'సాక్షి'దినపత్రికను మాత్రమే కొనుగోలు చేయాలన్న లక్ష్యంతో ఇచ్చారా? లేదా? అన్న విషయాన్ని లోతైన విచారణ జరిపి తేలుస్తామని స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా 'ఈనాడు'చేస్తున్న ఆరోపణల ఆధారంగా 'సాక్షి'కొనుగోళ్లను పెంచుకునేందుకు ప్రభుత్వం రూ.200 ఆర్థిక సాయం చేస్తోందన్న ప్రాథమిక నిర్ణయానికి ఈ దశలో రాలేమని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ప్రస్తావించిన కీలకాంశాలను పరిగణలోకి తీసుకుంటే ఇది సాక్షి – ఈనాడు మధ్య వ్యాపార సంబంధిత వివాదమని ధర్మాసనం అభిప్రాయపడింది. సాధారణంగా ఇద్దరి మధ్య జరిగే ఇలాంటి వ్యాపార యుద్ధాల్లో న్యాయస్థానాలు మధ్యంతర ఉత్తర్వుల దశలో అరుదుగా మాత్రమే జోక్యం చేసుకుంటాయని వ్యాఖ్యానించింది.

సురక్షిత 'యాత్ర'

- పర్యాటకులు, భక్తుల భద్రతకు ఏపీలో 20 టూరిస్ట్ పోలీసు స్టేషన్లు
- వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఏపీ ముఖ్యమంత్రి జగన్



సాక్షి, అమరావతి: ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు వ్యవస్థలో పలు సంస్కరణలు తెస్తున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో మహిళా పోలీసు వ్యవస్థను అందుబాటులోకి తేవడంతోపాటు రాష్ట్రంలో జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. సంస్కరణల్లో భాగంగా పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో పర్యాటకులు, యాత్రికుల భద్రత కోసం టూరిస్ట్ పోలీసు స్టేషన్లను తాజాగా అందు బాటులోకి తెస్తున్నట్లు ప్రకటించారు. ఏపీ వ్యాప్తంగా 20 ప్రాంతాల్లో టూరిస్ట్ పోలీసు స్టేషన్లను మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఇంకా ఏమన్నారంటే...

పర్యాటకులకు సౌకర్యాలు, భద్రత

పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించే వారి భద్రత కోసం ప్రత్యేకంగా 20 ప్రాంతాలను గుర్తించి కియోస్క్‌లు ఏర్పాటు చేశాం. అవి స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుబంధంగా 20 అదనపు పోలీస్ స్టేషన్లుగా పని చేస్తాయి. ప్రతి కియోస్క్‌లో ఆరుగురు సిబ్బంది రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారు. దీన్ని ఎస్ఐ లేదా ఏఎస్ఐ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. ఆపదలో చిక్కుకునేవారు సంప్రదించేందుకు ప్రత్యేకంగా టెలిఫోన్ నంబరు డిస్‌ప్లే చేస్తారు. కియోస్క్‌లలో సిబ్బందికి ప్రత్యేక టెలిఫోన్ నెంబరు, రేడియో సెట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఆ ప్రాంతానికి సంబంధించిన మ్యాపు, వాహనాల సదుపాయం కల్పించాం. పర్యాటకులు, యాత్రికులు నిర్భయంగా గడిపేలా భరోసా కల్పిస్తూ టూరిస్ట్ పోలీసు స్టేషన్లు పని చేస్తాయి. టూరిస్ట్ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించే సిబ్బందిలో సగం మంది మహిళలు ఉన్నారు. అక్కచెల్లెమ్మలు కియోస్క్‌లకు వెళ్లినప్పుడు మహిళా సిబ్బంది తోడుగా నిలబడతారు.

టూరిస్ట్ పోలీస్ స్టేషన్లు ఇలా..

- విశాఖపట్నం జిల్లా: ఆర్కే బీచ్
- కాకినాడ జిల్లా: కుక్కుటేశ్వర స్వామి దేవాలయం
- తూర్పు గోదావరి జిల్లా: పుష్కర ఘాట్
- ఏలూరు జిల్లా: ద్వారకా తిరుమల
- కృష్ణా జిల్లా: మోపిదేవి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం, మంగినపూడి బీచ్
- ఎన్టీఆర్ జిల్లా: విజయవాడ కనకదుర్గ ఆలయం, భవానీ ద్వీపం, పవిత్ర సంగమం ఘాట్
- ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా: మైపాడు బీచ్, పెంచలకోన దేవాలయం
- కర్నూలు జిల్లా: మంత్రాలయం దేవాలయం
- నంద్యాల జిల్లా: మహానంది, అహోబిలం ఆలయం
- అన్నమయ్య జిల్లా: హార్సిలీ హిల్స్
- వైఎస్సార్ జిల్లా: గండికోట, ఒంటిమిట్ట దేవాలయం
- శ్రీసత్యసాయి జిల్లా: లేపాక్షి దేవాలయంలతో పాటు మరో రెండు పర్యాటక ప్రాంతాలు.

లింగమనేని రమేష్ నిలువునా ముంచాడు

- విద్యాసంస్థల విస్తరణకు భూములు అప్పగిస్తానని లింగమనేని సంప్రదించారు
- పలు దఫాలుగా ఆయనకు రూ.310 కోట్లు ఇచ్చాను
- ఇప్పటిదాకా భూములు రిజిస్ట్రేషన్ చేయలేదు.. నగదూ ఇవ్వడం లేదు
- శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ విద్యాసంస్థల విస్తరణకు అవసరమైన భూములు, భవనాలను ఇస్తానని చెప్పి లింగమనేని రమేష్ తన దగ్గర నుంచి రూ.310 కోట్లు తీసుకున్నారని శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు ఆరోపించారు. అయితే ఇంతవరకు భూములు, భవనాలు అప్పగించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని ఒక హోటల్‌లో మంగళవారం తన న్యాయవాదులతో కలసి బీఎస్ రావు మీడియాతో మాట్లాడారు. 2012లో విద్యా సంస్థల విస్తరణకు తనకు 300 ఎకరాల భూములు అవసరమయ్యాయన్నారు. ఈ క్రమంలో వాటిని తాను ఇస్తానని లింగమనేని రమేష్ తనను సంప్రదించాడని చెప్పారు. ఈ క్రమంలో పలుమార్లు రూ.310 కోట్ల నగదును ఆయనకు ఇచ్చానని బీఎస్ రావు తెలిపారు. భూములు, భవనాలను సేకరించి ఇవ్వలేకపోతే తానిచ్చిన మొత్తం నగదును వడ్డీతో సహా చెల్లిస్తామని లింగమనేని 2013లో తనతో ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. అయితే ఇప్పటివరకు ఒక ఎకరం భూమి కూడా అప్పగించలేదని వాపోయారు. భూములు అప్పగించాలని తాను అనేక సార్లు అడిగితే 2015లో భూములను కొని.. రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని లింగమనేని తనతో ఎంవోయూ చేసుకున్నారని తెలిపారు. అది కూడా నేరవేర్చలేదన్నారు. తర్వాత జరిగిన మధ్యవర్తిత్వాలతో తనకు 15 చెక్కులను ఇచ్చారని.. వాటిని బ్యాంక్‌ల్లో జమ చేసినప్పుడు బ్యాంకులకు స్టాప్ పేమెంట్ అని లింగమనేని సమాచారం ఇచ్చారన్నారు. దీంతో బ్యాంకులు ఆ చెక్కులను తిరస్కరించాయని తెలిపారు.

హైదరాబాద్‌లో లింగమనేనిపై కేసు..

రమేష్ మోసం చేస్తున్నారని గ్రహించి హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో ఆయన గ్రూప్‌లపై క్రిమినల్ కేసు పెట్టామని బీఎస్ రావు చెప్పారు. దీంతో పోలీసులు లింగమనేని రమేష్, లింగమనేని రాజశేఖర్, లింగమనేని స్వర్ణకుమారి, లింగమనేని ప్రశాంతి, లింగమనేని సుమానా, కాకర్ల వినయ్‌లపై ఆరు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారన్నారు. నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు, హైకోర్టుల్లో కూడా కేసులు వేశామని తెలిపారు. తనకు ఇచ్చిన చెక్కుల్లో 20 శాతం నగదును చెల్లించాల్సిందిగా రమేష్ గ్రూప్‌నకు కోర్టులు ఆదేశాలు జారీ చేశాయన్నారు. అయినా తనకు నగదు ఇవ్వలేదని బీఎస్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ 6వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్.. లింగమనేని రమేష్ గ్రూప్‌నకు చెందిన స్థిర, చరాస్తులను రెవెన్యూ యాక్టు కింద అటాచ్ చేసి తనకు ఇవ్వాల్సిందిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినా స్పందన లేదన్నారు. లింగమనేని రమేష్ కంపెనీలపై చెన్నైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో ఐదు కేసులను దాఖలు చేశామని.. అవి పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సుప్రీం కోర్టు కూడా 18 శాతం వడ్డీతో వాయిదాల వారీగా నగదు మొత్తం చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినా రమేష్ పాటించడం లేదన్నారు.

బీఎస్ రావు ఆరోపణలు అవాస్తవం: లింగమనేని రమేష్

బీఎస్ రావు ఆరోపణలు పూర్తిగా అవాస్తవం.. నిరాధారం. చైతన్య విద్యా సంస్థల గ్రూప్‌నకు, మా గ్రూప్‌నకు మధ్య ఆర్థిక, వ్యాపార వివాదాలు ఉన్న మాట నిజమే. అయితే ఆయనను మోసం చేశామని బీఎస్ రావు ఆరోపించడం అవాస్తవం. ఈ అంశాలన్నీ కోర్టు పరిధిలో ఉన్నాయి. ఇప్పటివరకు ఏ న్యాయస్థానం మేము తప్పు చేసినట్లు తీర్పు ఇవ్వలేదు.

ఏబీవీపై చర్యలు తీసుకోండి

- రెండు స్టేజ్‌ల టైమ్‌స్కేల్ తగ్గించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఆదేశం
- కుమారుడికి అడ్డగోలు ప్రయోజనం కలిగించేందుకే ఆ కాంట్రాక్టు
- సీనియర్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు తీరుపై నిగ్గుతేల్చిన యూపీఎస్సీ



సాక్షి, అమరావతి: నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ)పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం.. ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయనకు రెండు స్టేజీల టైమ్‌స్కేల్ తగ్గించాలని తెలిపింది. 2024, మే 31వరకు ఇది అమలులో ఉంటుందని పేర్కొంది. ఏబీవీపై రెండు అభియోగాలు నిరూపితమయ్యాయని వెల్లడించింది. నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారంలో నిబంధనలు ఉల్లంఘించిన ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసిన ప్రభుత్వం ఆయనపై తదుపరి చర్యల కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. ఆయనపై మూడు అభియోగాల్లో ఒకటి పూర్తిగానూ మరొకటి పాక్షికంగానూ నిర్ధారణ అయ్యాయని యూపీఎస్సీ కేంద్ర హోంశాఖకు నివేదించింది. ఇజ్రాయెల్ కంపెనీ నుంచి నిఘా పరికరాల కొనుగోలు ద్వారా తన కుమారుడు చేతన్ సాయికృష్ణ భాగస్వామిగా ఉన్న కంపెనీకి ప్రయోజనం కలిగించేందుకు ఏబీవీ యత్నించారని.. అఖిల భారత సర్వీసు నిబంధనలకు సైతం విరుద్ధంగా వ్యవహరించారని తెలిపింది. దాంతో ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అఖిల భారత సర్వీసు నిబంధనలు–1969 ప్రకారం ఆయనపై తదుపరి చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని స్పష్టంచేసింది.

కుమారుడికి అడ్డగోలు కాంట్రాక్టు కోసమే

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు నిబంధనలకు విరుద్ధంగా నిఘా పరికరాల కొనుగోలుకు సిద్ధపడ్డారని యూపీఎస్సీ నిర్ధారించింది. ఇజ్రాయెల్‌కు చెందిన ఇన్‌ఫ్లేమబుల్ లిమిటెడ్, ఆర్‌టీఎల్‌టీఏ కంపెనీల నుంచి ఏరోస్టాట్, యూఏవీ నిఘా పరికరాల కొనుగోలుకు ఏకపక్షంగా నిర్ణయించారు. తద్వారా భారత్‌లో ఆ కంపెనీ ప్రతినిధిగా ఉన్న ఆకాశం అడ్వాన్స్ సిస్టమ్స్‌కు అయాచిత లబ్ధికి ప్రయత్నించారు. మరోవైపు.. ఏబీవీ కుమారుడు చేతన్‌సాయి ఆకాశం అడ్వాన్స్ సిస్టమ్స్‌కు సీఈఓ కావడం గమనార్హం. తన ఉన్నతాధికారుల అనుమతిలేకుండా ఏబీవీ ఏకపక్షంగా వ్యవహరించారు. పరికరాల నాణ్యత, గ్యారంటీ, నిర్వహణ కాలం మొదలైన సాంకేతిక ప్రమాణాలను తగ్గించి మరీ ఆమోదించేశారు. విధి నిర్వహణలో ఉత్సుకతతోనే ఇలా చేశానన్న ఏబీ వెంకటేశ్వరరావు వాదనను యూపీఎస్సీ తిరస్కరించింది.

ఎన్ఈపీపై కేంద్ర వర్సిటీల ఆసక్తి

సాక్షి, హైదరాబాద్: జాతీయ విద్యా విధానం–2020 అమలుకు సంబంధించిన అంశంపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్‌కుమార్ మంగళవారం 45 కేంద్ర విశ్వవిద్యాలయాల వైఎస్ చాన్స్‌లర్లతో ఆన్‌లైన్ వేదికగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వర్సిటీలు ఎన్ఈపీ అమలులో వారి అనుభవాలను, అవసరమైన సలహాలు, సూచనలు వెల్లడించాయి. సమీక్షలో వెల్లడైన ముఖ్యమైన అంశాలను యూజీసీ మీడియాకు వెల్లడించింది.

- కేంద్ర విశ్వవిద్యాలయాలన్నీ అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ పోర్టల్‌లో నమోదు చేసి, విద్యార్థుల వివరాలను ఆన్‌బోర్డ్ చేస్తున్నాయి. అన్ని కేంద్ర వర్సిటీలూ యూజీ, పీజీ స్థాయిలో ఎగ్జిట్ పాలసీ, బహుళ ప్రవేశానికి సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించాయి. అవసరమైన మార్పులకు శ్రీకారం చుట్టాయి. కఠినమైన అంశాలను తొలగించాయి. ● విద్యార్థుల్లో విలువలు, నైపుణ్యం, సమకాలీన అంశాలపై పట్టు పెంచేలా పాఠ్య ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నాయి. వృత్తి విద్యలో మరిన్ని కోర్సులు పెంచుతున్నాయి. ఫీల్డ్ అనుభవాన్ని పెంచేందుకు ప్రాధాన్యమిస్తున్నాయి. పరిశోధనకు అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇంక్యుబేషన్, ఇన్నొవేషన్, ఆధునిక పరిశోధన కేంద్రాల స్థాపనపై దృష్టి పెడుతున్నాయి. ● క్రెడిట్స్ బదిలీ కోసం స్వీయ నిబంధనలు రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఏకీకృత పాఠ్యబోధన ప్రణాళిక వైపు అడుగులేస్తున్నాయి.

స్కూలు పిల్లలకు 'వనదర్శిని' అవగాహన

సాక్షి, హైదరాబాద్: అడవులు, పర్యావరణంపై వాటిని కాపాడాల్సిన ఆవశ్యకతను వనదర్శిని కార్యక్రమం ద్వారా స్కూల్ విద్యార్థులకు అటవీశాఖ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పాఠశాల స్థాయి విద్యార్థుల నుంచే పర్యావరణ ప్రాధాన్యత, అటవీ పరిరక్షణ ఆవశ్యకతను గురించి వివరిస్తున్నారు. ఇందులో భాగంగా అడవులను కాపాడాలన్న సంకల్పాన్ని పిల్లల్లో కల్పనకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు జిల్లాల్లో నిర్వహిస్తున్న వనదర్శిని కార్యక్రమానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోంది. స్కూలు విద్యార్థులను అడవుల్లోకి తీసుకెళ్లి అక్కడి వివిధ రకాల చెట్లు, ఔషధ మొక్కల గురించి అటవీ అధికారులు పరిచయం చేశారు. పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉండే అడవుల వల్ల ఉపయోగాలు, అడవులపై పెరుగుతున్న ఒత్తిడిని విద్యార్థులకు అర్థం అయ్యేలా వివరిస్తున్నారు. తాజాగా మేడ్చల్ జిల్లా అటవీశాఖ నేతృత్వంలో కీసర రిజర్వ్ ఫారెస్ట్‌లో వనదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులను కీసర అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్న కీసర ఎకో అర్బన్ పార్క్‌ను విద్యార్థులు సందర్శించి సేద తీరారు. విద్యార్థుల వనదర్శిని కార్యక్రమం వివరాలను ట్విట్టర్‌లో షేర్ చేసిన సంతోష్ ఆనందాన్ని వ్యక్తంచేశారు.

మార్కెట్‌లోకి హీరో ఎక్స్‌టెక్ 110సీసీ స్కూటీ విడుదల



పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని అశ్విని హీరో షోరూంలో మంగళవారం హీరో కంపెనీకి సంబంధించిన నూతన మాడల్ ఎక్స్‌టెక్ 110సీసీ స్కూటీని మార్కెట్‌లోకి ఎంవీఐ నరేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూం ఎండీ దిలీప్ మాట్లాడుతూ ఈ స్కూటీ పరిశ్రమలో మొదటిసారిగా కార్నర్ బెండింగ్ లైట్లు అమర్చినట్లుగా తెలిపారు. 0 నుంచి 60కిలోమీటర్ల వేగం కేవలం 9.35సెకన్లలో అందుకుంటుందన్నారు. పూర్తిగా డిజిటల్ మీటర్‌తో పాటు బ్లూటూత్ కనెక్టివిటీ, ఆర్‌టీఎంఐ, మొబైల్ చార్జింగ్, ప్రొజెక్టడ్ ఎల్ఈడీ హెడ్‌లాంప్ లాంటి ఎన్నో ఆధునాతన ప్రత్యేకతలు ఉన్నాయని తెలిపారు. ఈ స్కూటీ మార్కెట్‌లో నాలుగు రంగులలో లభ్యమవుతుందని, దీని ఎక్స్‌షోరూం ధర రూ.76,699లకు అందుబాటులో ఉందన్నారు. అనంతరం ఎంవీఐ నరేష్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవాహనదారులు తప్పక హెల్మెట్ వాడాలని, మితిమీరిన వేగంతో ఏమాత్రం వాహనం నడపరాదన్నారు. ప్రత్యేకంగా మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు.

హత్య కేసులో జీవిత ఖైదు

- రూ.10వేలు జరిమానా

నర్వ: హత్య కేసులో నిందితునికి జీవితఖైదు, రూ.10వేలు జరిమానా విధిస్తూ నారాయణపేట ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి రఫీ తీర్పు ఇచ్చారని ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఉమ్మడి మండలంలోని బుడ్యగానితండాకు చెందిన వర్త్య సుభమ్మకు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు సంతానం. పెద్దకుమార్తె సునీతను 2015లో ధన్వాడ మండలం మందిపల్లితండాకు చెందిన రాథోడ్ మంగ్యానాయక్‌తో వివాహం నిశ్చయించారు. ఈ క్రమంలోనే గత 17 ఏప్రిల్ 2015న, రాత్రి 9గంటలకు మంగ్యానాయక్ సునీత ఇంటికి వచ్చి రాత్రి పడుకున్నాడు. తెల్లవారు జామునే అతడు వెళ్లడంతో ఉదయం తల్లి లేచి బెడ్‌రూంలో విగతజీవిగా పడిఉన్న తన కూతురును చూసింది. ఈ సంఘటనపై అప్పట్లో నర్వ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నర్సిములుకు ఫిర్యాదు చేసింది. కేసు విచారణలో భాగంగా మంగళవారం అడిషనల్ పీపీ విక్రమ్‌దేవ్ సాక్షులను విచారించగా నర్వ ఎస్ఐ విక్రమ్, కోర్టు కానిస్టేబుల్ వేణుగోపాల్ సాక్షులను ప్రవేశపెట్టారు.

శిక్షలతోనే నేరాలు తగ్గుముఖం

జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్



మాట్లాడుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

నారాయణపేట: నేరం చేసిన వారికి న్యాయస్థానాల్లో కఠిన శిక్షలు అమలైనప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయానికి రాగా ఎస్పీ ఎస్.వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి అధికారుల వివరాలు, పనితీరు, విధివిధానాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే న్యాయం జరుగుతుందన్న నమ్మకం సామాన్యుడికి కలిగించేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. దొంగతనాలు, నేరాలు జరగకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రో మొబైల్ సిబ్బంది అనుక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ డయల్ 100 ఫిర్యాదులకు వెంటనే స్పందించి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని కోరారు. కమ్యూనిటి పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటును వేగవంతం చేయాలని.. తద్వారా నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు. నేరస్తులను పట్టుకోవడమేగాక సరైన ఆధారాలతో శిక్షలు పడేలా సమయానికి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తులో జాప్యం సరికాదని, నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మత్తు పదార్థాలు, పేకాటపై నిఘా ఉంచడంతో పాటు సైబర్ నేరాల నియంత్రణకు గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పనిచేయడంతో పాటు ప్రజలకు పారదర్శక సేవలందించాలని సూచించారు. సమీక్షలో డీఎస్పీలు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సీఐలు రవిబాబు, సీతయ్య, శ్రీకాంత్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాంలాల్, ఎస్ఐలు సురేశ్, రాములు, సతీష్, నరేందర్, పర్వతాలు, అశోక్ బాబు, విక్రమ్, శ్రీనివాసులు, శ్రీనివాసరావు, రమేష్, సునీత, శివశంకర్, ఐటీ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా..



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆలయ ఈఓ, చైర్మన్

- మహాశివరాత్రికి ముస్తాబవుతున్న అలంపూర్ ఆలయాలు
- ఏర్పాట్లను పరిశీలించిన ఈఓ, చైర్మన్

జోగుళాంబ శక్తిపీఠం: మహాశివరాత్రి ఉత్సవాలకు అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. ఈ నెల 17 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మంగళవారం జరుగుతున్న పనులను పరిశీలించారు. భక్తులు ఆలయానికి చేరుకోగానే వెలుపల ఇన్ఫర్మేషన్ సెంటర్, అక్కడి నుంచి సర్వదర్శనాలు, లఘు దర్శనాలు, శీఘ్ర దర్శనాలు, అతిశీఘ్ర దర్శనాలు, అభిషేకాలకు సంబంధించిన ప్రత్యేక క్యూలైన్ పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. క్యూలైన్ల దగ్గర ఫ్యాన్లతోపాటు మంచినీటి సౌకర్యం, ఉచితంగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. సుమారు 25 వేల మంది భక్తులు ఆలయాలను దర్శించే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు భక్తులకు ఆర్యవైశ్యుల సహకారంతో అల్పాహారాలు, దేవస్థానం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ఉచిత ప్రసాదాలు కూడా అందజేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మహాశివరాత్రి రోజు లింగోద్భవన కాలంలో శివస్వాముల కోసం ఆకాశ జ్యోతి దర్శనం, అలాగే లింగోద్భవన కాల యమపూజలు, అర్ధరాత్రి దాటిన తర్వాత జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి కల్యాణోత్సవం, జాగరణ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అక్బర్‌పేటలోని తేరు మైదానంలో రథోత్సవ ఏర్పాట్లను సైతం వారు పరిశీలించారు. అలాగే ఈ ఏడాది మహాశివరాత్రికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా స్వర్ణలింగాభిషేకం చేసేందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయని చెప్పారు.

నాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

- రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్
- వైభవంగా పద్యనాటకోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: నాటక రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత అందిస్తున్నదని తెలంగాణ సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్ అన్నారు. మన్యంకొండ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో దేవాలయం ఆవరణలో పద్యనాటానికి పట్టాభిషేకం పేరిట నిర్వహిస్తున్న పద్య నాటక ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి జరిగిన నాటక ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శివకుమార్ మాట్లాడుతూ మన్యంకొండ ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నాటక ప్రదర్శనలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. నేటి యువత కళలను బతికించుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నాటక రంగ పూర్వవైభవం కోసం కృషి చేయాలని కోరారు.

- ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి జడ్చర్ల నవజ్యోతి కళా నిలయం ఆధ్వర్యంలో మైరావణ పద్యనాటకం, శ్రీకృష్ణరాయబారం, శ్రీరామాంజనేయ యుద్ధ ఘట్టాలను ప్రదర్శించారు. నాటకంలో పాత్రధారులు చక్కటి అభినయంతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీమిత్రకళానాట్య మండలి ప్రధాన కార్యదర్శి వి.నారాయణ మాట్లాడుతూ నేడు (బుధవారం) నాటక ముగింపు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. చివరి రోజు శ్రీచంద్రముఖి కల్చరల్ అకాడమీ (మహబూబ్‌నగర్) ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన, వివిధ భజన మండళ్ల ఆధ్వర్యంలో భజనలు ఉంటాయని, భక్తులు తిలకించాలనికోరారు. కార్యక్రమంలో శ్రీమిత్ర కళా నాట్య మండలి ఉపాధ్యక్షులు నర్సింలు, వెంకటయ్య, మాధవరాజు, రామాచారి, శేఖరాచారి, శివాచారి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మైరావణ నాటక ప్రదర్శన



జములమ్మను దర్శించుకున్న భక్తులు

గద్వాల రూరల్: నడిగడ్డ ప్రాంత ప్రజల ఇలవేల్పు జములమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. మంగళవారం జములమ్మ జాతరను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి నైవేద్యంతో పాటు సంప్రదాయ పద్ధతిలో లొగ్గలు వేస్తూ, మహిళల పూనకాలతో ఊగిపోయారు. అలాగే పరశురాముడిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పోలీసులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూశారు.



ఆన్‌లైన్ ద్వారానే పెన్షన్ వివరాలు పంపాలి

ఆర్టీసీ రిటైర్డ్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఆన్‌లైన్ ద్వారానే పెన్షన్ వివరాలు పంపాల్సి ఉంటుందని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక పారిశ్రామికవాడలోని ఫోరం కార్యాలయంలో జరిగిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2014 సెప్టెంబర్ కన్నా ముందు పదవీ విరమణ పొందిన ర్టీసీ ఉద్యోగులు తాము సర్వీసులో ఉన్నప్పుడు హయ్యర్ పెన్షన్‌కు ఆప్షన్ ఇచ్చి ఉంటే, అది పీఎఫ్ కార్యాలయం వారు తిరస్కరించి ఉంటేనే హయ్యర్ పెన్షన్‌కు అర్హులని తెలిపారు. పీఎఫ్ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులతో విశ్రాంత ఉద్యోగులు అయోమయానికి గురుతున్నారని, దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది దళారులు హయ్యర్ పెన్షన్ ఫారాల పేరిట డబ్బులు వసూలు చేస్తూ మోసం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు మాట్లాడుతూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పట్ల ఆర్ఎం శ్రీదేవి వెంటనే స్పందించి పరిష్కరిస్తారని తెలిపారు. సమావేశంలో ఫోరం రాష్ట్ర కోశాధికారి సయ్యద్ ఫరీద్, కృష్ణ, నారాయణ, ఉమేష్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. సమావేశంలోని జిల్లాలోని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు